ఐదోరోజు 5,298 ఇళ్లలో సర్వే

- సర్వేను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్
- పీర్లబావి, కిద్వాయిపేటలో కొనసాగిన సర్వే
- మున్సిపల్ కార్యాలయంలో ఎన్యుమరేటర్లతో కమిషనర్ సమీక్ష


పీర్లబావి ప్రాంతంలో కుటుంబ సర్వేను తనిఖీ చేస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో సమగ్ర కుటుంబ సర్వే ఐదోరోజుకు చేరుకుంది. బుధవారం మొత్తం 49 వార్డుల పరిధిలో 5,298 ఇళ్లను ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరిగి కుటుంబ యజమానుల నుంచి సమాచారం సేకరించారు. పీర్లబావి ప్రాంతం, కిద్వాయిపేటలో సర్వే కార్యక్రమాన్ని కలెక్టర్ విజయేందిర బోయి ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, టీపీఓ లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం లో ఎన్యుమరేటర్లతో కమిషనర్ సమీక్షించారు. సర్వేకు సంబంధించి కొన్ని అంశాలపై వారికి గల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఇక మొత్తం 78,696 ఇళ్లకు గాను ఇప్పటివరకు 20,642 ఇళ్లకు సంబంధించిన సర్వే పూర్తయింది.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్


పోమాల్‌లో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

నవాబుపేట: సామాజిక సర్వే పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ తెలిపారు. బుధవారం ఆయన మండల పరిధిలోని పోమాల్ గ్రామంలో సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సర్వేను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, అందుకు అధికారులు సర్వేను క్షుణ్ణంగా పరిశీలించి చేయాలన్నారు. ప్రజల అభివృద్ధికి ఈ సర్వే చాలా ముఖ్యమని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అందుకు ప్రతి ఒక్కరు సర్వే అధికారులకు సహకరించాలని ఆయన సూచించారు. మండలంలో సర్వే తీరుబాగుందని, అధికారులు మరింత వేగం పెంచి రోజుకు 12కు తగ్గకుండా ఇండ్లను సర్వే చేయాలన్నారు. ఈ సందర్భంగా సర్వే పత్రాలు పరిశీలించి ప్రజలతో క్రాస్‌చెక్ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్, బద్రునాయక్, ఏఓ కృష్ణకిషోర్ ఉన్నారు.

కాళోజీకి ఘన నివాళి

జడ్చర్ల టౌన్: కాళోజీ నారాయణరావు వర్ధంతిని పురస్కరించుకుని సంస్కార భారతి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని అనురాగిణి ఆశ్రమంలో ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా సంస్కార భారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ మాట్లాడుతూ దేశ అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ అవార్డు పొందిన వ్యక్తిగా కాళోజీని కొనియాడారు. భాషా సాహిత్య రంగంలో ఆయన చేసిన సేవల గూర్చి అనురాగిణి విద్యార్థులకు తెలిపారు.

16 నుంచి అన్నదానం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని గంగాపురం రోడ్డులో ఉన్న శ్రీ జ్ఞాన సరస్వతి సహిత అయ్యప్పస్వామి దేవాలయంలో శనివారం నుంచి అయ్యప్పస్వామి మాలాధారులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని దేవాలయ కమిటీ అధ్యక్షుడు బాదేపల్లి రంజిత్ బాబు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 8వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం వేళలో నిర్వహించే అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని అయ్యప్పస్వాములు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముడా డైరెక్టర్‌గా హరిబాబుకు అవకాశం ఇవ్వాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ముడా డైరెక్టర్‌గా మహబూబ్‌నగర్ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిబాబుకు అవకాశం ఇవ్వాలని అసోసియేషన్ జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ అహ్మద్‌అలీ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు హరిబాబు, కో చైర్మన్ హైదర్ అలీ, దిలీప్, రాంనరేష్, సురేష్‌రెడ్డి, వంశీ, రవికిరణ్, బాల్‌రాజు పాల్గొన్నారు.

యువత సామాజిక బాధ్యత కలిగి ఉండాలి


వీసీని సన్మానిస్తున్న అధ్యాపకులు, కో ఆర్డినేటర్లు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: యువత సామాజిక బాధ్యత కలిగి ఉండాలని పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ పేర్కొన్నారు. పీయూలో లైబ్రరీ ఆడిటోరియంలో ఎన్ఎస్ఎస్‌సెల్ ఆధ్వర్యంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువు కేవలం తరగతి గదికే కాకుండా సమాజంలో ఉన్న ప్రతి అంశాన్ని తెలుసుకోవాలన్నారు. సమాజ సేవ, ఆత్మవిశ్వాసం, సేవా దృక్పథం, నాయకత్వ లక్షణాలు నేర్చుకునేందుకు అవకాశం ఉందన్నారు. అన్ని అంశాలపై అవగాహన ఉన్న వారు జీవితంలో ఎటువంటి పరిస్థితులైన ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంటారని, సమాజంలో ఉన్న మూఢనమ్మకాలు, ఆచారాలు రూపుమాపాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు చంద్రకిరణ్, నూర్జహాన్, అధాపకులు ప్రవీణ, భూమయ్య, శ్రీనాథాచారి, రవికుమార్, శివకుమార్‌సింగ్ పాల్గొన్నారు.

ఎంపీని పోలీసులు అడ్డుకోవడం సరికాదు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎంపీగా తన నియోజకవర్గంలో పర్యటిస్తున్న ఎంపీ డీకే అరుణను పోలీసులు అడ్డుకోవడం సరికాదని, ఈ సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు పి.శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. నిజాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎంపీ సొంత నియోజకవర్గంలో పర్యటించే స్వేచ్ఛ లేదా? అని ప్రశ్నించారు. సీఎం అన్న తిరుపతి రెడ్డికి ప్రొటెక్షన్ ఇచ్చి సమస్య జరిగిన ప్రాంతానికి పంపించిన పోలీసులు, ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు వెళ్లిన ఎంపీని అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. ఇందుకు సీఎం రేవంత్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

విధులు నిర్వర్తించకపోయినా వేతనం


భూత్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

భూత్పూర్: మండలంలోని శేరిపల్లి(బీ) ఆశావర్కర్ సునీత మూడు నెలలుగా విధులకు హాజరు కావడం లేదు. అయినప్పటికీ ఆమె పనిచేసినట్టుగా రికార్డుల్లో నమోదు పొందుపరిచి, వేతనం కాజేసినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు శేరిపల్లి (బీ), నర్సింగాపూర్, తండాల్లో 'సాక్షి' విజిట్ చేపట్టింది. సమాచారం తెలుసుకున్న సెకండ్ ఏఎన్ఎం వెంకట నర్సమ్మ ఆందోళనకు గురయ్యారు. విధులకు హాజరు కాకపోయినా హాజరైనట్లు రికార్డుల్లో పొందుపరిచి ఆశావర్కర్‌కు వేతన బిల్లులు చేయడానికి గల కారణాలను వివరించారు. ఆశావర్కర్ తల్లి అనారోగ్యంతో పాటు ఆమె ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో వేతన బిల్లులు చేసిన విషయం వాస్తవమేనని చెప్పుకొచ్చారు. అయితే సదరు ఆశావర్కర్ డ్రా చేసుకున్న వేతనం డబ్బులను తిరిగి ఇవ్వడానికి అంగీకరించినట్లు చెప్పారు. కాగా, ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు సీరియస్ అయినట్లు తెలిసింది. సంబంధిత రికార్డులతో బుధవారం సాయంత్రం మరో ఏఎన్ఎంతో కలిసి సదరు సెకండ్ ఏఎన్ఎం ఉన్నతాధికారుల వద్దకు వెళ్లినట్లు సమాచారం. అధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఆశావర్కర్ వేతనం కాజేసిన వివరాలను సేకరించేందుకు 'సాక్షి' ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లగా.. వైద్యాధికారి అబ్దుల్ రబ్‌తో మాట్లాడుతున్న ఫొటోను అటెండర్‌తో తీయించి, జిల్లా వైద్యాధికారుల వాట్సప్ గ్రూప్‌లో పోస్టు చేయడం గమనార్హం. ఇదిలా ఉంటే, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బందికి ఫిక్స్‌డ్ టూర్ అలవెన్స్‌కు సంబంధించిన బిల్లులు చేయకుండా ఆస్పత్రి అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని సీహెచ్‌ఓ ఆయూబ్ ఖాన్ దృష్టికి తీసుకెళ్లగా.. తమకు సూపర్‌వైజర్లు, సిబ్బంది నివేదిక ఇవ్వని కారణంగా బిల్లులు చేయడం లేదని వివరించారు.

ప్రత్యేక పూజలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం బ్రాహ్మణవాడిలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కార్తీక శుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో తులసీ కళ్యాణం నిర్వహించారు. అనంతరం దాదాపు 2వేల ఉసిరికాయలతో దేవాలయంలో కార్తీక దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గొండ్యాల రాఘవేంద్ర శర్మ, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం


గోపన్‌పల్లి సమీపంలో కౌకుంట్ల రహదారిపై సీఎం దిష్టిబొమ్మతో రాస్తారోకో చేస్తున్న రైతులు


దేవరకద్ర: మండలంలోని గోపన్‌పల్లి గ్రామంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఆందోళన చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి నాలుగు రోజులు గడుస్తున్నా ఒక్క సంచి ధాన్యం కూడా కొనలేదని కౌకుంట్ల రహదారిపై రాస్తారోకో నిర్వహించి సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామానికి దూరంగా పొలాల్లో ఉన్న ధాన్యం కేంద్రానికి తీసుకొచ్చి నాలుగు రోజులుగా పగలు, రాత్రి ఉంటున్నామన్నారు. కొనుగోలు కేంద్రం ప్రారంభించిన రోజే చాలా మంది రైతులు ధాన్యం నిబంధనల ప్రకారం తేమ శాతం చాలా తక్కువగా ఉందని, అయినా అధికారులు ధాన్యం కొనడంలో జాప్యం చేస్తున్నారని తెలిపారు.కార్యక్రమంలో నాయకులు, రైతులు కోట్ల విజయభాస్కర్ రెడ్డి, రమేష్‌సాగర్, కోట్ల వెంకట్‌రెడ్డి, వెంకట్‌రాములు, రఘువర్ధన్‌రెడ్డి, చిన్నవెంకటేశ్, కృష్ణసాగర్, రమేష్‌రెడ్డి, హన్మంతు, నరేందర్‌రెడ్డి, కోట్ల మహేశ్వర్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల కృషి


ఉత్సవాల్లో పాల్గొన్న సభ్యులు

మహమ్మదాబాద్: ఒకతరం మరోతరానికి ఆదర్శవంతులుగా ఉంటూ పాఠశాల అభివృద్ధికి నాటి విద్యార్థులు ఎంతో కృషి చేస్తున్నట్లు పాఠశాల షష్ట్యాబ్ది కమిటీ కార్యదర్శి విజయానంద్‌రెడ్డి తెలిపారు. నవంబర్ 13న మహమ్మదాబాద్ బాలుర ఉన్నత పాఠశాల షష్ట్యాబ్ది వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పూర్వ విద్యార్థులు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు 'నా పాఠశాల నేను' అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ఏర్పాటై 63 ఏళ్లు గడిచిన సందర్భంగా ఎంతో మంది మాజీ విద్యార్థులు ఇప్పుడు ఎన్నో ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో ఉంటూ పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తున్నట్లు కొనియాడారు. నేటి విద్యార్థులు కూడా ఉన్నత చదువులు చదువుకుని మంచి ఉద్యోగాలు సంపాదించి వచ్చే తరాల విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాండురంగారెడ్డి, షష్ట్యాబ్ది కమిటీ సభ్యులు రామ్‌లాల్, ముంతాజ్, రాంరెడ్డి, అనంతయ్యగుప్త, హుస్సేన్, షంషీర్, వెంకటయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

150 కిలోమీటర్లు పూర్తయిన పాదయాత్ర



నవాబుపేట: జిల్లా మాజీ విద్యాశాఖ అధికారి డాక్టర్ విజయకుమార్ చేపట్టిన బాపుబాటలో పాదయాత్ర బుధవారం మండల కేంద్రానికి చేరింది. గాంధీజీ జయంతి రోజు జోగులాంబ దేవాలయం నుంచి ప్రారంభించిన పాదయాత్ర బుధవారం 150 కిలోమీటర్లు పూర్తి చేసుకుని మండల కేంద్రంలో అడుగుపెట్టింది. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలతో పాటు సమాజంలో ఎలా నడుచుకోవాలో చెప్పాలన్నారు. బాపు చూపిన బాటలో అహింసా మార్గాన్ని అందరు అలవాటు చేసుకొని నవ సమాజ నిర్మాణానికి పాదయాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల, కేజీబీవీ, యన్మన్‌గండ్ల జూనియర్ కళాశాల, జెడ్పీ పాఠశాలలను ఆయన సందర్శించి మాట్లాడారు. పాదయాత్రకు మండల సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో ఆయన వెంట సీనియర్ సిటిజన్‌లు నర్సింహులు, వేణునాథం, వెంకటేశ్వరప్ప, నాగభూషణం, తదితరులు ఉన్నారు.

చిన్నారుల మరణాలు నియంత్రించాలి


నవాబుపేటలో నిమోనియాపై వివరిస్తున్న జిల్లా అధికారి పద్మ

నవాబుపేట: తరచుగా సంభవిస్తున్న చిన్నారుల మరణాలు 0 నుంచి 5 సంవత్సరాల లోపే ఎక్కువగా ఉన్నాయని, వాటిలో 15 శాతం మరణాలకు నిమోనియా వ్యాధి కారణమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ పద్మ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ప్రపంచ నిమోనియా వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఉన్న బాలింతకు ఈ వ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిమోనియాను తొలిదశలోనే గుర్తిస్తే నివారణ సాధ్యమన్నారు. చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు వ్యాధి నిరోధక శక్తి చాలా అవసరమన్నారు. వారు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. చిన్నారులకు తల్లి ముర్రుపాలు విధిగా పట్టించాలని సూచించారు. అందరు జాగ్రత్తగా ఉండి బలమైన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ రఫిక్, డాక్టర్ శ్రీజ, రమేష్, జయశీల, రజిత, పద్మ, భాగ్యమ్మ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధర


చౌడూర్‌లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

నవాబుపేట: రైతులకు గిట్టు బాటు ధర అందించేందుకే గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు దుశ్యంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు చౌడూర్, గురుకుంట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యానికి సంబంధించి గన్నీ బ్యాగులు కొరత లేకుండా చూస్తామని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది జీవరత్నం, కాంచన, బాలమణి, యశోధ, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

దేవరకద్ర: కౌకుంట్ల మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ నరేందర్‌రెడ్డి, కురుమూర్తి దేవస్థాన కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, దేవరకద్ర మార్కెట్ కమిటీ చైర్మన్ కతలప్ప, రాఘవేందర్‌రెడ్డి, సీఈఓ శ్రీనివాసులు, ఏఓ శివకుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలతోనే దేశాభివృద్ధి

పాలమూరులో ఎల్ఐసీ కళాజాతా ప్రదర్శన


కళాజాతా ప్రదర్శన నిర్వహిస్తున్న ఉద్యోగులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రభుత్వ రంగసంస్థల మనుగడతోనే దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని ఇన్సూరెన్స్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు అన్నారు. ప్రభుత్వరంగ సంస్థ ఎల్ఐసీని బలపరచాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ చౌరస్తాలో బుధవారం కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. దాదాపు గంటపాటు కళాజాత ప్రదర్శనలో నాటికలు, పాటల ద్వారా ప్రభుత్వరంగ సంస్థల ప్రాముఖ్యత, ఎల్ఐసీ విశిష్టతను వివరించారు. కళాజాత ప్రదర్శనకు సౌత్‌సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ జి.తిరుపతయ్య సారథ్యం వహించారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ ఉద్యోగుల సంఘం హైదరాబాద్ డివిజన్ ఉపాధ్యక్షులు వి.రాజేశ్వర్‌తో పాటు ప్రతినిధులు కరుణాకర్‌గౌడ్, ఎల్.మద్దిలేటి, గిరిధర్, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసన్, రాజేష్, సుజాత, ఝాన్సీ, రజిత, అరుణ, వరలక్ష్మి, రమణి, చక్రపాణి, గణేష్, సాయిబాబా, రఘు, రాములు, ఆనంద్, సత్యనారాయణ, శ్రీనివాసులు, సీఐటీయూ నాయకులు కురుమూర్తి, యూటీఎఫ్ నాయకులు రవికుమార్, ఐఎన్‌టీయూసీ నాయకులు రాములుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ రూపుమాపాలి


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న పుట్టపాగ రఘుపతిరావు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయనున్నట్లు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ పుట్టపాగ రఘుపతిరావు అన్నారు. బుధవారం బోయపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థల ఆదేశాల మేరకు పాన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం అనేక చట్టాల గురించి వివరించారు. డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ యోగేశ్వర్ రాజ్ యాదవ్, అసిస్టెంట్ మల్లారెడ్డి, వినోద్ కుమార్, స్కూల్ ప్రిన్సిపల్స్, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

➪ బాలకార్మిక వ్యవస్థను రూపుమాపడం తల్లిదండ్రుల చేతిలోనే ఉంటుందని పారా లీగల్ వలంటీర్ ఏ.రాజసింహుడు అన్నారు. మహబూబ్‌నగర్ మండలం కోటకదిరలోని జెడ్పీహెచ్ఎస్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ సేవా అధికార సంస్థ చట్టపరంగా వివిధ చర్యలు చేపడుతున్నా ఈ వ్యవస్థ పూర్తిగా నిర్మూలన కాలేదన్నారు. మరో పారా లీగల్ వలంటీర్ రామచంద్రయ్యగౌడ్ మాట్లాడారు. బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా అరికట్టేందుకు అందరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.కె.మెర్సీతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో పరీక్ష ఫలితాలు విడుదల చేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీజీ పరీక్షల ఫలితాలు ఆన్‌లైన్‌లో విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు శివకుమార్, వేణుగోపాల్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆన్‌లైన్‌లో విడుదల చేయడం వల్ల విద్యార్థులు నేరుగా మెమోలు పొందేందుకు అవకాశం ఉందని, ఆఫ్‌లైన్‌లో విడుదల చేయడం వల్ల అనేక రకాల ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ఆఫ్‌లైన్ మెమోలు వచ్చే వరకు చాలా సమయం పడుతుందని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే అధికారులు ఆన్‌లైన్ విధానంలో ఫలితాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జడ్చర్ల టౌన్: 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా బాదేపల్లి ఫీడర్‌లో ఉదయం 10 గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. నిమ్మబావిగడ్డ, మార్కెట్‌యార్డుతో పాటు గంగాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలు, కిష్టంపల్లి, బూర్గుపల్లి, కోడుగల్ సబ్‌స్టేషన్ పరిధిలోనూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. పోలేపల్లి 132 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో మిషన్ భగీరథ సరఫరాకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యక్తిగత వివరాలు సేకరించటం దగా

జడ్చర్ల టౌన్: సమగ్ర కులగణన చేపడతామని చెప్పిన ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే పేరుతో వ్యక్తిగత విషయాలు సేకరించటం బీసీలను దగా చేయడమేనని బీసీ జాగృతి సేన కార్మిక విభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆరోపించారు. బుధవారం ఎమ్మార్సీ వద్ద నిర్వహించిన జాగృతి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు డిసెంబర్‌లో సమగ్ర కులగణన గణాంకాలను బహిరంగపర్చి జనాభా దామాషా పద్ధతిన స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ జాగృతిసేన నాయకులు జి. నర్సింహులు, లింగంపేట శేఖర్, కుర్వగడ్డపల్లి గోపాల్, రఘు, రామస్వామి, గోపాల్, శివశంకర్ పాల్గొన్నారు.

లగచర్ల ఘటనపై న్యాయ విచారణ చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో ప్రభుత్వ అధికారులపై దాడి సంఘటనపై న్యాయ విచారణ చేయాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా సమన్వయ కర్త బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరించడంతోనే ఆ సంఘటన జరిగినట్లు పేర్కొన్నారు. ప్రజా స్వామ్యంలో ఉద్యోగులు ప్రజలకు సేవకులుగా ఉండకుండా నియంతృత్వంగా వ్యవహరించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. తమ భూములు పోతున్నాయనే ఆందోళనలో ఉన్న ప్రజల వద్దకు ఎలాంటి సమాచారం లేకుండా ఆకస్మాతుగా రావడం వల్ల పలు రకాల అనుమానాలు వస్తున్నాయని పేర్కొన్నారు.

గత ప్రభుత్వంలో ప్రజలకు తీరని అన్యాయం

హన్వాడ: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఇటీవల మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వరికొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని ఖండించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు కృష్ణయ్య, సుధాకర్, రాములు పాల్గొన్నారు.

క్రీడా మైదానానికి స్థలం కేటాయించాలి

మిడ్జిల్: మండల కేంద్రంలో 2006లో సర్వే నంబర్లు 207, 209, 217, 218, 219, 220లో మొత్తం 33 ఎకరాలు వెంచర్ చేశారని, ఆ వెంచర్‌లో గ్రామ పంచాయతీకి క్రీడా మైదానం కోసం స్థలం కేటాయించాలని గ్రామస్తులు బుధ వారం తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఆ భూమిపై విచారణ చేస్తామని తహసీల్దార్ తెలిపారు. మాజీ వార్డు సభ్యులు భాస్కర్, చంద్రశేఖర్, భాస్కర్‌గౌడ్, నిరంజన్, ఉన్నారు.

మహిళ అదృశ్యం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని కురిహిణిశెట్టి కాలనీకి చెందిన మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. కురిహిణిశెట్టి కాలనీకి చెందిన శివాని మతిస్థిమితం సక్రమంగా లేదు. మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన ఆమె, మళ్లీ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీజేపీని బలోపేతం చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీజేపీని పట్టణంలో బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణ అధ్యక్షులు నారాయణ యాదవ్ అధ్యక్షతన బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో పాలమూరు పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలమూరు పట్టణంలో అత్యధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు చేయించాలని, ప్రతి ఒక్కరూ తమకు ఇచ్చిన టార్గెట్‌ను గడువు లోపు పూర్తి చేసి పార్టీ కార్యాలయంలో సమర్పించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు షేరి పాండురంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, నాయకులు బుడన్న, జిల్లా కార్యాలయ ప్రముఖ్ సుబ్రహ్మణ్యం, నాగరాజు యాదవ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు యాదయ్య, శ్రీశైలం, దర్పల్లి హరికృష్ణ, రవీందర్ రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.